ఆపదలో సీఎంఆర్ఎఫ్‌తో ఆసరా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రామాయంపేటలో చెక్కు అందజేస్తున్న సుప్రభాతరావు

పెద్దశంకరంపేట/రామాయంపేట/నిజాంపేట, అక్టోబర్ 3: ఆపదలో ఆసరాగా సీఎంఆర్ఎఫ్ చెక్కు ఉపయోగపడుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటకు చెందిన విఠల్‌రెడ్డికి దవాఖాన ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.40 వేల చెక్కును అందజేశారు. ఆయనతో ఆర్ ఎన్ సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

రామాయంపేటలో..

అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్నదని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, రామాయంపేట మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి అన్నారు. రామాయంపేటలోని తండా వాసులు, డీ ధర్మారం గ్రామ పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదగిరి, సుందర్‌సింగ్, రాజు, గంగాధర్, నాయకులు వెంకటేశ్, స్వామి, స్వామి, భైరం కుమార్, వినయ్‌సాగర్, శంకర్, రాజయ్య, విప్లవ్ తదితరులు ఉన్నారు.

నిజాంపేటలో..

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన యాడరం లక్ష్మీకి రూ.45 వేలు, కేశాల్ వంశీకి రూ.9 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకుడు లక్ష్మణ్ అందజేశాడు. కార్యక్రమంలో రాములు, నారాయణ, స్వామి, అశోక్, ప్రసాద్, యాదగిరి తదితరులు ఉన్నారు.

నిజాంపేటలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకుడు లక్ష్మణ్

ఘనంగా బతుకమ్మ సంబురాలు

రామాయంపేట, అక్టోబర్ 3: పట్టణంతో పాటు మండలంలో బతుకమ్మల పండుగను ఘనంగా జరుపుతున్నారు. గురువారం మహిళలంతా బతుకమ్మలు తయారు చేసి, ప్రధాన వీధుల్లో పెట్టి ఆడుతూ పాటలు పాడారు. అనంతరం బతుకమ్మలను సర్వాయికుంట, హనుమ చెరువులోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పనిలో శ్రద్ధ కనబరిస్తే తప్పక గుర్తింపు

రామాయంపేట, అక్టోబర్ 3: పనిలో శ్రద్ధ కనబర్చిన వారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని జిల్లా ఇరిగేషన్ శాఖ ఈఈ సంపత్ కుమార్ అన్నారు. గురువారం రామాయంపేటలోని వాటర్‌మెన్ శిక్షణా శిబిరానికి వచ్చి పలు సూచనలు సలహాలిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి వాటర్‌మెన్ శ్రద్ధగా పని చేయాలన్నారు. వాటర్‌ట్యాంకు ఎక్కేముందు దిగే ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. మెను ప్రకారం ట్యాంకులో బ్లీచింగ్ పౌడర్ కలుపాలన్నారు. దీంతో ప్రజలకు మంచి నీటిని అందించిన వారమవుతామన్నారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో పనిచేసే వాటర్‌మెన్లు ఉదయం, సాయంత్రం నీటిని అందించాలన్నారు. ఈ శిబిరంలో రామాయంపేట ఎంపీడీ షాజులుద్దీన్, ఏపీవో శంకర్, మిషన్ భగీరథ ఏఈ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తెగుళ్ల నుంచి రక్షణకు సస్యరక్షణ చర్యలు

వెల్దుర్తి, అక్టోబర్ 3: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే తెగుళ్లు ఆశిస్తాయని మాసాయిపేట మండల వ్యవసాయ అధికారి రామశివరావు అన్నారు. గురువారం మాసాయిపేటలో వరిపంటలను ఏఈవో రజిత, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ముందస్తుగా వేసిన పంటలు కోతకు వస్తున్నాయని, ఆలస్యంగా వేసిన పంటలకు తెగుళ్లు సోకుతున్నాయన్నారు. పొట్టదశలో ఉన్న వరి పంటకు కాండం తొలుచు తెగుళ్లు ఆశిస్తున్నాయని, వాటి నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ లేదా టెట్రానిలిప్రోల్ 0.5 మి.లీలను నీటిలో కలిపి పిచుకారీ చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో బ్యాక్టీరియా సోకడానికి అనుకూలమన్నారు. సుడిదోమ తెగుళ్లు కూడా సోకే ప్రమాదం ఉందన్నారు. తెగుళ్లు సోకిన పంటల రక్షణకు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు.

మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం

నర్సాపూర్, అక్టోబర్ 3: నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా దవాఖాన వైద్య బృందం సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరంలో వైద్యులు పట్టణవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు యాదగిరి, నాయకులు పంబల భిక్షపతి, మెడికల్ ఆఫీసర్లు, రెడ్డిపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

రేగోడ్, అక్టోబర్ 3: తహసీల్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించినట్లు తహసీల్దార్ నరేశ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు కార్డు నమోదుకు జతపర్చాల్సినవి డిగ్రీ పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, ఒక పాస్ ఫొటో తీసుకుని రావాలని ఓటర్లకు సూచించారు. జిరాక్స్ పత్రాలపై కచ్చితంగా గజిటెడ్ సంతకం ఉండాలన్నారు. చివరి తేదీ 6 నవంబర్ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్ఐ ఫిరోజ్, సిబ్బంది లక్ష్మణ్, మల్లేశం, రాములు ఉన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాలు

రామాయంపేట, అక్టోబర్ 3: ఖమ్మం వరద బాధితుల కోసం జిల్లా నిరుద్యోగ ఉద్యమ కళాకారుల ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రామాయంపేటలోని కళాకారులు వాడవాడలా తిరుగుతూ వరద బాధితులకు సాయం చేయాలని, ప్రతి ఇంటికీ, దుకాణానికి తిరిగారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డుగుడాల సత్యనారాయణ, వెంకటేశ్, చక్రాల రఘు, దరువు అంజన్న, కిరణ్, చీకోటి సాయిలు, రమేశ్, ప్రధాన కార్యదర్శి స్వామి, ప్రేమ్‌కుమార్, శేఖర్‌చారి, దేవరాజు, పాపయ్య, భూమయ్య, శ్రీశైలం, యాదగిరి, నవీన్ తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు పక్కా ప్రణాళిక

- మెదక్ జిల్లాకు 2000 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల సాగు
- ఇప్పటివరకు 1231 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్
- జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్

మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్‌సింగ్

మెదక్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంచుకుని అధిక విస్తీర్ణంలో తోటల పెంపకానికి కృషి చేయాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్‌సింగ్ అన్నారు. గురువారం హవేళీఘనపూర్ రైతు వేదికలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ, లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. ఎకరా వరి వేసే నీళ్లతో ఐదెకరాల పంట పండించవచ్చన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు మొక్కలపై రాయితీ, నాలుగేండ్లు తోట నిర్వహణ, అంతర పంటల సాగుకు రాయితీ మొత్తంగా రూ.26,450 సొమ్మును రైతుల ఖాతాకు జమ చేస్తారన్నారు. ఎకరానికి 57 మొక్కలు, 9x9 మీటర్ల దూరంలో త్రికోణ ఆకార పద్ధతిలో నాటుకోవాలని డాక్టర్ రంగనాయకులు తెలిపారు. నాలుగేండ్ల తర్వాత ఎకరానికి 10 నుంచి12 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉప సంచాలకుడు వినయ్, మెదక్ ఉప సంచాలకులు విజయ నిర్మల, ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ, ఏఈవో బాల్‌రెడ్డి, నర్సాపూర్ ఉద్యాన అధికారి సంతోష్, మెదక్ ఉద్యాన అధికారి రచన, రైతులు పాల్గొన్నారు.

బురదజల్లే రాజకీయం మానుకోవాలి

- చిల్లర రాజకీయాలు చేస్తున్న కొండా సురేఖ
- కేటీఆర్, హరీశ్‌రావుపై చేస్తున్న వ్యాఖ్యలు ఖండిస్తున్నాం
- మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్
- మైనంపల్లి కాంగ్రెస్‌లో నీ హోదా ఏందో చెప్పాలి
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి

మెదక్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకులు బురద జల్లే రాజకీయం మానుకోవాలని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తరపున ఖండిస్తున్నామన్నారు. దుబ్బాకలో మైనంపల్లి హన్మంతరావు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిల్లర రాజకీయాల కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంత్రి కొండా సురేఖ అనవసరంగా బురద చల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. నిండు అసెంబ్లీలో మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి మీద సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడితే ఎవరూ స్పందించలేదని గుర్తుచేశారు. మల్లనసాగర్ ముంపు గ్రామాల ప్రజలను ఒప్పించి నిర్మించడంతో రెండు పంటలు పండుతున్నాయన్నారు. హల్దీ వాగు మీద చెక్ డ్యాం కట్టడంతో వేసవిలోనూ జలకళ సంతరించుకుందన్నారు. రేవంత్‌రెడ్డి హైడ్రా బాధితులను పరిశీలిస్తే వారి బాధలేంటో తెలుస్తాయన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో మెదక్ నియోజకవర్గం పోటీ పడాలని, ప్రతిపక్షంగా సహకరిస్తామని తెలిపారు. పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో రుణమాఫీ జరగని రైతుల సమస్యలు పట్టించుకోకుండా పోలీసులు అడ్డుపెట్టుకుని ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిచి 9 నెలలు కావస్తున్నా పైసా తీసుకురాలేదన్నారు. బీఆర్ఎస్ తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు.

మైనంపల్లికి కాంగ్రెస్‌లో ఏ హోదా ఉందో చెప్పాలి

కాంగ్రెస్‌లో మైనంపల్లి హన్మంతరావుకు ఏ హోదా ఉందో చెప్పాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి డిమాండ్ చేశారు. ఏ హోదాతో మైనంపల్లి హనుమంతరావుకు ప్రొటోకాల్ ఇస్తున్నారని ప్రశ్నించారు. మెదక్ నియోజకవర్గానికి గతంలో ఇద్దరు ఎమ్మెల్యేలు అని ప్రశ్నించినవారే ఇప్పుడు నియోజకవర్గానికి నలుగురు ఎమ్మెల్యేలు అయ్యారన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ పక్కన బట్టి జగపతి

అభివృద్ధిలో మెదక్ 20 ఏండ్లు వెనక్కి వెళ్లిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరైనా మాట్లాడితే కేసులు పెడుతున్నారన్నారు. కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడంలో కాదు, అభివృద్ధిలో పోటీ పడాలని హితవుపలికారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, జయరాజ్, ఆర్‌కె శ్రీనివాస్, పార్టీ హవేళీఘనపూర్ మండల అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, నాయకులు ప్రభురెడ్డి, సాయిలు, రాజు, మోహన్ రాథోడ్, కిరణ్, భువన్, చందు, పాషా తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరి దేవీగా అమ్మవారు

మెదక్ మున్సిపాలిటీ: దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపుగా మండపానికి తరలిస్తున్న భక్తులు

కౌడిపల్లి: వెంకటరావుపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట కొర్విపల్లిలో..

చిలిపిచెడ్: చాముండేశ్వరికి జలాభిషేకం చేస్తున్న అర్చకులు

రామాయంపేట/పాపన్నపేట/శివ్వంపేట/ చిన్నశంకరంపేట/ నిజాంపేట/చిలిపిచెడ్, అక్టోబర్ 3: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తిశ్రద్ధలతో దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ చేశారు. మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవీగా ముదురు పసుపు రంగులో దర్శనమించారు. రెండో రోజు గాయత్రీ దేవి రూపంలో గులాబీ రంగులో దర్శనం ఇవ్వనున్నట్లు ఏడుపాయల ఈవో చంద్రశేఖర్ తెలిపారు. పలు మండపాలలో ప్రతిష్ఠించిన ఆలయ సన్నిధిలో అమ్మవారికి మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. ఏడుపాయల్లోని గోకుల్‌షెడ్‌లో శరన్నరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురం నుంచి గోకుల్‌షెడ్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. శివ్వంపేట మండలంలోని చిట్కుల్‌లో చాముండేశ్వరీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యా. మొదటి రోజు అమ్మవారికి సంపూర్ణ మహబలాభిషేకం,గణపతి పూజ, స్వస్తిహవచనం, అఖండ దీపారాధన, కలశస్థావన, వనదుర్గా, భువనేశ్వరీ, మహకుండలి పూజలు చేశారు.

రామాయంపేట: అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న మహిళా భక్తులు

నిజాంపేట: దుర్గామాత అమ్మవారి ఊరేగింపులో సింగిడి కేరళ బ్యాండ్ బృందం సభ్యుల నృత్యాలు

వెల్దుర్తి: బాలా త్రిపుర సుందరి అవతారంలో

పెద్దశంకరంపేటలో కొలువు దీరిన అమ్మవారు

శివ్వంపేట మండలంలోని పిల్లుట్లలో దుర్గామాత మండపం వద్ద మైక్ సెట్ అందజేస్తున్న శ్రీధర్ గౌడ్

కుటుంబ సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలి

మెదక్, (నమస్తే తెలంగాణ)/ నర్సాపూర్/చిన్నశంకరంపేట, అక్టోబర్3: కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. గురువారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని 8వ వార్డులో డిజిటల్ కుటుంబ కార్డు సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ వార్డు, మండలంలోని గొల్లపల్లి గ్రామాన్ని సర్వేకు ఎంపిక చేశామన్నారు. ఈ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి కుటుంబం వివరాలు డిజిటల్ కార్డు సర్వేలో నమోదు చేయాలని ఆదేశించారు. కుటుంబంలో ఎంత మంది ఉన్నారు, వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట కౌడిపల్లి తహసీల్దార్ ఆంజనేయులు, శివంపేట్ ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, మేనేజర్ మధూసూదన్, కౌన్సిలర్ రాంచందర్ ఉన్నారు. మండలంలో ని గొల్లపల్లి గ్రామంలో డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్ పాల్గొన్నారు.

నర్సాపూర్: పట్టణంలోని 8వ వార్డులో డిజిటల్ కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్‌లో సర్వేను పరిశీలించిన ఆర్డీవో రమాదేవి

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రమాదేవి తెలిపారు. మెదక్ మున్సిపాలిటీలో ఈ నెల 7వ తేదీ వరకు ఈ సర్వేను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ.. కుటుంబంలోని వ్యక్తుల పేర్లు, వయసు, ఆధార్ నంబర్, అడ్రస్ పక్కాగా నమోదు చేయాలన్నారు. రోజూ కనీసం 50 కుటుంబాల్లో సర్వే చేయాలన్నారు.

మెదక్ మున్సిపాలిటీలో సర్వే వివరాలను తెలుసుకుంటున్న ఆర్డీవో రమాదేవి

ఎండు గంజాయి పట్టివేత

నర్సాపూర్, అక్టోబర్ 3: తూప్రాన్ మున్సిపల్ శివాజీనగర్‌లోని ఇంటి నెంబర్ 6-76 ఇంటిలో 260 గ్రాముల ఎండుగంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తితే ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఆదేశాల మేరకు డీటీఎఫ్ మెదక్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తూప్రాన్ మున్సిపాలిటీలోని శివాజీనగర్‌లో అక్రమంగా గంజాయి విక్రయాలు జరిపే వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేశారు. శివాజీనగర్‌లోని ఇంట్లో సంగ నర్సింహులు అక్రమంగా గంజాయి విక్రస్తున్నాడనే సమాచారం తెలిసిన అధికారులు గురువారం సోదాలు చేశారు. ఈ సోదాల్లో అతని వద్ద నుంచి 260 గ్రాములు కలిగిన 40 గంజాయి ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఒక ప్యాకెట్‌ను రూ.500లకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. దీని విలువ సుమారు రూ.20 వేలు ఉన్నట్లు తెలిసింది. అనంతరం నిందితుడిని ఎస్‌హెచ్‌వో నర్సాపూర్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో పీఅండ్‌ఈఐ డీటీఎఫ్ నరేందర్, పీఅండ్‌ఈఎస్‌ఐ డీటీఎఫ్ బాలయ్య, పీఅండ్‌ఈహెచ్‌సీ డీటీఎఫ్ చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, హరీశ్, నరేశ్, నవీన్, రవి పాల్గొన్నారు.

నర్సాపూర్ ఎక్సైజ్ పోలీసుల ఆధీనంలో నిందుతుడు

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

రామాయంపేట, అక్టోబర్ 3: కుటుంబీకులు మృతి చెందడంతో వారి అంత్యక్రియలకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి మహిళ మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం రాయిలాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నబోయిన సావిత్రి(65) ఆమె భర్త కిష్టాగౌడ్ సెప్టెంబర్ 28న సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలో కుటుంబీకులు చనిపోతే అంత్యక్రియలకు వెళ్లారు. అంత్యక్రియలు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో రాయిలాపూర్ శివారు దాటగానే నందిగామ సాయి చెరువు దగ్గర కుక్కల గుంపు ఎదురుపడడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మృతురాలు సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై.బాలరాజు తెలిపారు. ఇదే ప్రమాదంలో బైక్‌పై నుంచి పడ్డ కిష్టాగౌడ్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆయన దవాఖానలోనే చికిత్స పొందుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

సావిత్రి (ఫైల్)

బస్సులు నడపాలని డీఎంకు వినతి

వెల్దుర్తి, అక్టోబర్ 3: వెల్దుర్తి నుంచి పలు ప్రాంతాలకు బస్సులు నడపాలని కోరుతూ ఎంపీ రఘునందన్‌రావు ఇచ్చిన లెటర్‌ను మేడ్చల్ బస్‌డిపో మేనేజర్‌కు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ గురువారం అందజేశారు. వెల్దుర్తికి ఇతర ప్రాంతాల నుంచి బస్సు సౌకర్య లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపీ లెటర్‌పై స్పందించిన డిఎం రూట్లను పరిశీలించి బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయనతో నాయకులు నవీన్, నాగరాజు, పవన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

రైతులతో అవార్డు ఎంక్వైరీ

నర్సాపూర్,అక్టోబర్ 3: నర్సాపూర్‌లోని రైతువేదికలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ట్రిబులార్‌లో భూములు కోల్పోతున్న రైతులతో గురువారం అవార్డు ఎంక్వైరీ నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని మహ్మదాబాద్, తిరుమలాపూర్, తుజాల్‌పూర్, పెద్దచింతకుంట రైతులతో అవార్డు ఎంక్వైరీని నిర్వహించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానం ఇచ్చారు. రైతుల అభిప్రాయాలను కూడా స్వీకరించారు. శుక్రవారం మూసాపేట్, నాగులపల్లి, చిన్న చింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల రైతులతో అవార్డు ఎంక్వైరీ ఉంటుందన్నారు.

రెండో రోజు 283 డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 3: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన గురువారం కొనసాగింది. స్కూల్ అసిస్టెంట్ తెలుగు మీడియం విభాగంలో 309 మంది అభ్యర్థులకు 195 మంది, ఉర్దూ మీడియంలో 35 మందికి 35 మంది, ఎస్‌జీటీ కేటగిరీలో 106 మందికి 53 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఈనెల 5వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుంద డీఈవో తెలిపారు.

మెదక్ జిల్లా సీపీవో భూక్యా మాన్య బదిలీ

మెదక్, అక్టోబర్ (నమస్తే తెలంగాణ): జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా పని చేస్తున్న భూక్యా మాన్య నల్గొండ ఈడీఎస్సీ కార్పొరేషన్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన యాదాద్రి, భువనగిరి, నల్గొండ జిల్లాల్లో పని చేశారు. 2024 మార్చి 15న జిల్లా సీపీవోగా బాధ్యతలు చేపట్టారు.

నేడు సీఎం కప్ టార్చ్ ర్యాలీ

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 3: తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ పేరిట గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడలు నిర్వహిస్తుంది. క్రీడాకారుల అవగాహన కోసం శుక్రవారం సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాల అధికారి దామోదర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 4న సాయంత్రం 4 గంటలకు మంబోజిపల్లి బ్రిడ్జి నుంచి అవుట్‌డోర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో క్రీడాకారులు, క్రీడాసంఘాలు, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సివిల్ సప్లయ్ గోదాం తనిఖీ

పెద్దశంకరంపేట,అక్టోబర్3: పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంను జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం హరికృష్ణ గురువారం అకస్మికంగా తనిఖీచేశారు. గోదాంలో స్టాక్ వివరాలు, రేషన్‌షాపుల్లో బియ్యం సరఫరాను పరిశీలించారు. గోదాం నిర్వహణ తీరుపట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట గోదాం ఇన్‌చార్జి దత్తరెడ్డి ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 3: గ్రామాల్లో ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిటీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే సంవత్సరానికి గ్రామాల్లో ఉపాధి కింద చేపట్టబోయే పనులను ప్రణాళికా రూపంలో తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉపాధి ద్వారా హార్టికల్చర్, అగ్రి ఇతర పనులు చేపట్టాలన్నారు. మండలంలోని మాడ్చెట్‌పల్లి, శివయపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. సమావేశంలో ఎంపీవో విఠల్‌రెడ్డి, ఏపీవో నవాజోద్దీన్, తదితరులున్నారు.